

ఈనాడు ఒడిశా
మంగళవారం అక్టోబరు 22, 2024

24 రాత్రి లేదా 25 ఉదయం తీరం దాటనున్న తుపాను

- నేడు వాయుగుండం, రేపు తీవ్ర తుపాను: ఐఎండీ





పొంచి ఉన్న తుపాను దిశ తెలియజేస్తూ సోమవారం ఐఎండీ జారీ చేసిన చిత్రాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. మంగళవారం ఉదయం ఇది వాయుగుండంగా మారనుంది. బుధవారం నాటికిది తుపానుగా బలం పుంజుకుంటుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. 24 రాత్రి లేదా 25వ తేదీ ఉదయం పూరీ, సాగరద్వీపం (బెంగాల్) మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయన్నారు. మంగళవారం దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. 24, 25 తేదీల్లో ఉత్తరకోస్తా, తీర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్నారు. తుపాను తీరం దాటే సమయంలో గాలి తీవ్రత 120 కిలోమీటర్లుగా ఉంటుందన్న అంచనా ఉందన్నారు. కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్ జిల్లాల తీరాల్లో రాకాసి అలలు తీరం వైపునకు విరుచుకుపడతాయన్నారు. భారీ వర్షాల వల్ల నదుల్లో ప్రవాహాలు పెరుగుతాయని, వరదలకు అవకాశం ఉందన్నారు. మంగళవారం ఓడరేవులకు ప్రమాద హెచ్చరికలు జారీ చేయనున్నామని చెప్పారు. బుధవారం ఉత్తర, పశ్చిమదిశగా ఒడిశా తీరానికి తుపాను చేరువవుతుందని మూర్తి తెలిపారు.

గర్భిణులను ముందుగా ఆసుపత్రుల్లో చేర్చాలి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒక వారం, పది రోజుల్లో ప్రసవం కానున్న గర్భిణులను ముందుగా ఆసుపత్రుల్లో చేర్పించాలని ఆరోగ్యశాఖ మంత్రి **ముఖేష్ మహాలింగ** సోమవారం అధికారులను ఆదేశించారు. తుపాను విపత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటివారిని మంగళ, బుధవారాల్లో ఆసుపత్రులకు తరలించాలని ఉత్తరకోస్తా తీర జిల్లాల వైద్యాధికారులకు (సీడీఎంఓ) సూచించారు. దీంతో ఆయా జిల్లాల్లో ఆశ, అంగన్‌వాడీల సాయంతో గర్భిణుల తరలింపునకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆందోళన వద్దు

- 79 బస్తీల వాసులను తరలిస్తాం
- సిబ్బంది సెలవులు రద్దు: మంత్రి సురేష్



సురేష్ పూజారి, ఉన్నతాధికారుల సమీక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పొంచి ఉన్న తుపానును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టిందని, ప్రజలు ఆందోళనకు గురి కావద్దని రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్‌పూజారి చెప్పారు. సోమవారం లోక్‌సేవా భవన్‌లో ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా, ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) దేవ్‌రంజన్‌కుమార్ సింగ్, అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్ తదితర ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. అనంతరం సురేష్ విలేకర్లతో మాట్లాడుతూ...లోతట్టు, తీర ప్రాంతాల్లో ఉంటున్న 79 బస్తీల వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలని నిర్ణయించామన్నారు. పరిస్థితి గమనించి జిల్లాల పాలనాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. తుపాను ఒడిశాలో తీరం దాటుతుందని ఐఎండీ అంచనా వేసినందున ప్రభుత్వం ముందస్తు చర్యలన్నీ చేపడుతోందన్నారు. సిబ్బంది సెలవులు రద్దు చేశామని, ఓడ్రాఫ్, అగ్నిమాపక జవానులను ప్రభావిత జిల్లాలకు తరలించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. భువనేశ్వర్‌లో 24x7 కంట్రోల్ రూం ప్రారంభమైందని, సీఎస్, ఎస్ఆర్‌సీలు నిరంతర నిఘా ఉంచారన్నారు. ఆయా జిల్లాల్లోనూ కంట్రోల్ రూంలు సిద్ధమయ్యాయన్నారు. తహసీల్దార్లు, బీడీఓలు, కార్యనిర్వహణ అధికారులు, ఇతర సిబ్బంది ప్రభావిత ప్రాంతాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులంతా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతున్నామన్నారు. ఆశ్రయ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. విపత్తులను ఎదుర్కోవడంలో విశేషానుభవం గల యంత్రాంగం ఈ తుపానులో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటుందని మంత్రి చెప్పారు.

అన్నదాతలు అప్రమత్తం కావాలి

- ఉన్నతాధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్ష



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కనకవర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'దానా' తుపానుతో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనా ఉన్నందున అన్నదాతలు అప్రమత్తం కావాలని, వ్యవసాయ, విద్యుత్తు శాఖల బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్ దేవ్ చెప్పారు. సోమవారం లోక్‌సేవాభవన్‌లో సింగ్‌దేవ్ ఈ రెండు శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... పశ్చిమ ఒడిశా జిల్లాల్లో పంట కోతకొచ్చినందున పంటను కోసి కుప్పలు వేసి పాలిథిన్ కవర్లు కప్పాలన్నారు. ధాన్యం పొట్ట దశలో ఉన్నచోట్ల రైతులు పంట పొలాల్లో గట్లు కొట్టి నీరు విడుదలయ్యేలా చూసుకోవాలన్నారు. తుపాను గాలుల తీవ్రత వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగొచ్చన్నారు. దీనివల్ల మంచినీటి సరఫరాకూ ఇబ్బందులు కలుగుతాయన్న అంచనాతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడానికి సన్నాహాలు చేశామన్నారు. టాటా ట్రాన్స్‌మిషన్ సంస్థ ఈ దిశగా ముందస్తు సన్నాహాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు.

సీఎస్ సమీక్ష.. మరోవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా లోక్‌సేవా భవన్‌లో సోమవారం అత్యవసర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పాలనాధికారులతో దూర దృశ్య శ్రవణ మాధ్యమంలో మాట్లాడారు. తుపాను ముందు, తరువాత చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాలపై సూచనలిచ్చారు.

మత్స్యకారుల్లో వణుకు



గోపాల్‌పూర్ తీరంలో వలలు, తాళ్లు ఒడ్డుకు తెచ్చుకుంటున్న గంగపుత్రులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: అండమాన్ సముద్రంలో ఏర్పడ్డ అల్పపీడనం తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ అధ్యయన శాఖ (ఐఎండీ) అధికార వర్గాలు హెచ్చరించిన తరువాత తీర ప్రాంతాల మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. 1999 అక్టోబరు నాటి ప్రచండ తుపాను, ఫైలిన్, హుద్‌హుద్, తిత్లీ, ఫొని తదితర తీవ్ర తుపానులు దగ్గర నుంచి చూసిన వారంతా ఏ నిమిషానికి ఏమవుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

100 కి.మీ. దాటనున్న గాలి వేగం

బాలేశ్వర్, పశ్చిమబెంగాల్ మధ్య తుపాను తీరం దాటుతుందని ఐఎండీ అధికారవర్గాలు చెబుతున్నాయి. విదేశీ మెట్ సంస్థలు ఈ విపత్తు ఒడిశా తీరానికే చేరవవుతుందని పేర్కొన్నాయి. గోపాల్‌పూర్, పూరీ, పరదీప్, బాలేశ్వర్‌లలో ఏదో ఒక చోట తీరం వద్ద తుపాను దాటొచ్చని చెబుతున్నాయి. గాలి తీవ్రత గంటకు 100 నుంచి 120 కిలోమీటర్లుగా ఉంటుందని గోపాల్‌పూర్ ఐఎండీ అధికారి ఉమాశంకర్‌దాస్ సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

ఈ మూడు జిల్లాల్లో అతి భారీ వర్షాలు

గంజాం, పూరీ, జగత్సింగ్‌పూర్ జిల్లాల్లో బుధ నుంచి అతి భారీ (25 నుంచి 30 సెంటీమీటర్లు) వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నట్లు ఉమాశంకర్ దాస్ తెలిపారు. ఈ మూడు జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించామన్నారు. ఖుర్దా, కేంద్రపడ, భద్రక్, బాలేశ్వర్, జాజ్‌పూర్, కటక్, ఢెంకనాల్, అనుగుల్, మయూర్‌భంజ్ జిల్లాలకు ఆరెంజ్, మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు.



భద్రక్ చేపల రేవులో మరపడవలు

తీర ప్రాంతాల్లో రెడ్ అలర్ట్

24న తుపాను తీరం దాటుతుందని ఐఎండీ స్పష్టం చేసింది. దీనికి ముందుగా అతిభారీ వర్షాలు కురుస్తాయి. ఈ విపత్తు ఎక్కడ తీరం దాటినా ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత అంచనా ప్రకారం గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. సోమవారం కేంద్ర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో తీర జిల్లాల యంత్రాంగాలు గోపాల్‌పూర్ నుంచి బాలేశ్వర్ వరకు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. సందర్శకులు సముద్రంలో స్నానాలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశాయి.

తక్షణం తీరానికి చేరుకోవాలి

మంగళవారం నుంచి సముద్రంలో కెరటాల ఉద్ధృతి పెరగనుంది. ఉపరితలంలో 35 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. చేపలు వేటాడుతున్న మత్స్యకారులు తక్షణం తీరానికి చేరుకోవాలని, తదుపరి సూచనల వరకు వేటకు వెళ్లరాదని ఐఎండీ అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీంతో మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చుతున్నారు.

అమర వీరులు.. స్ఫూర్తిప్రదాతలు



పోలీసు కుటుంబాల మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీజీపీ ఖురానియా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు చిరస్మరణీయులని, వారు శాఖకు స్ఫూర్తిప్రదాతలని డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా చెప్పారు. సోమవారం కటక్‌లోని పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో అమర పోలీసు దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీజీపీ దివంగత పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించి వారి సేవలు ప్రస్తుతించారు. తల్లులు, భార్యలకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన దీపస్తంభాల వేడుకలు



వేదికపై జ్ఞాపికలు అందజేస్తున్న ముఖ్యమంత్రి మోహన్, పక్కన కేంద్రమంత్రి శర్వానంద

గోపాలపూర్, న్యూస్‌టుడే: గత రెండు రోజుల నుంచి కొనసాగిన దీపస్తంభాల వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా పూరీలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఓడరేవులు, నౌకా రవాణాశాఖల మంత్రి శర్వానంద సోనోవాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో రాష్ట్రానికి సేవలందిస్తున్న వారికి ముఖ్యమంత్రి సత్కరించారు. పర్యాటక రంగాన్ని ఆకర్షించడానికి ఏటా ఒడిశాలో దీపస్తంభాల వేడుకలు చేపడతామని శర్వానంద చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

విమానాశ్రయం విస్తరణ పనుల పరిశీలన

అధికారులతో సమీక్షించిన మంత్రి బిభూతి



విమానాశ్రయం ఆవరణలో అధికారులతో మంత్రి బిభూతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ చేరువలోని రొంగాయిలొండ ఎయిర్ స్ట్రిప్‌ను విమానాశ్రయంగా విస్తరించడానికి గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనికి అవసరమైన స్థలం బ్రహ్మపుర విశ్వవిద్యాలయం (భంజవిహార్) యంత్రాంగం గతంలో ఇచ్చింది. ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం వాణిజ్య, రవాణా, ఉక్కు గనుల శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా పనులు పరిశీలించారు. అధికారులతో పురోగతిపై సమీక్షించారు. 750 మీటర్ల పొడవున్న రన్‌వే 1200 మీటర్లకు పెంచుతున్నారు. ఇదివరకు 9 మంది కూర్చొని వెళ్లే తేలికపాటి విమానాలు ఇక్కడ నుంచి భువనేశ్వర్‌కు రాకపోకలు సాగించేవి. విస్తరణ తరువాత 80 సీట్ల బోయింగ్ విమానాలు ల్యాండ్ అవొచ్చు. 2025 ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేయాలని ధ్యేయంగా పెట్టుకొన్నారు. సమీప భవిష్యత్తులో రొంగాయిలొండ విమానాశ్రయం మీదుగా విశాఖ, దిల్లీ, బెంగళూరు నగరాలకు విమానాలు రాకపోకలు చేయనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గోపాల్‌పూర్ టాటా సెజ్ పారిశ్రామికవాడగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయం విస్తరణ పనులకు ప్రాధాన్యమిచ్చిందని చెప్పారు.

ఏవోబీలో నిలిచిన రాకపోకలు

మూడు రోజులైనా కొలిక్కి రాని సమస్య

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు కూనేరు వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత కారణంగా మూడు రోజులుగా రాయగడ జిల్లా కెరడ వంతెనపై వాహనాలు నిలిచి ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు స్తంభించాయి. దీనికి తోడు తరచూ కురుస్తున్న వర్షాలకు వాహనాలు బురద నీటి నుంచి ముందుకు కదల్లేని పరిస్థితి తలెత్తింది. ఈ కారణంగా ఇరు రాష్ట్రాల మధ్య నడిచే ప్రభుత్వ, ప్రైవేటు బస్సు సర్వీసులు సైతం 3 రోజులుగా రద్దయ్యాయి. నిత్యం ఈ మార్గంలో దక్షణాది రాష్ట్రాల నుంచి ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్‌కు వందలాది లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఇటు ఒడిశా, అటు ఆంధ్రా ఇరువైపులా 5 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ రోడ్డుకు మరమ్మతు చేయాలని పలుమార్లు ఆంధ్రా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చి, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోలేదని, తామే సొంత ఖర్చులతో మూడుసార్లు మరమ్మతులు చేసినట్లు భాజపా నాయకుడు, రాయగడ లారీ యజమానుల యూనియన్ అధ్యక్షుడు కొండబాబు తెలిపారు. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కెరడ వంతెనపై నిలిచిన లారీలు



హబిషార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా



పూజా సామగ్రి ఇచ్చి మహిళకు పాదాభివందనం చేస్తున్న ముఖ్యమంత్రి

గోపాలపూర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదివారం రాత్రి పూరీ వచ్చారు. హబిషార్థులు (కార్తిక వ్రత దీక్షాధారులు) ఉంటున్న బృందావతి నివాస్, మున్సిపల్ కల్యాణ మండపం, నీలాద్రి భక్త నివాస్, యాత్రి నివాస్‌లను సందర్శించారు. దీక్షాధారులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. కొందరి ఆశీస్సులు అందుకున్నారు. సకాలంలో అన్నీ అందుబాటులో ఉంటున్నాయా? అని అడిగిన ముఖ్యమంత్రి ఇబ్బందులుంటే వెంటనే సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. దీక్షాధారులకు పూజా సామగ్రి బ్యాగులు అందజేశారు. వారితో కలసి జగన్నాథ కీర్తనలు ఆలపించారు. బృందావతి నివాస్‌లో ఏర్పాటైన ప్రవచనం విన్నారు. అనంతరం ఆయన పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వయిన్‌తో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వ్రతాలు చేయడానికి వచ్చిన మహిళలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ వచ్చి పరిస్థితి సమీక్షించాలని ఆదేశించారు.



శిబిరంలో వ్రతధారుల ప్రార్థనలు

రెండు బస్సులు ఢీ

- నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు
- చిన్న దెబ్బలతో బయటపడ్డ 14 మంది



ఘటనా స్థలంలో బోల్తాపడిన బస్సు



ప్రమాదానికి గురైన మరో బస్సు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ఓ ప్రైవేటు బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటన గజపతి జిల్లా మోహన్ ఠాణా పరిధి లిల్లిగూడ గ్రామ ప్రాంతంలో కెందుఘట్ మలుపు వద్ద సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఠాణా అధికారి బసంత్‌సెఠి తెలిపిన వివరాల మేరకు.. పూరీ నుంచి మల్కాన్‌గిరి వైపు వెళ్తున్న బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో కెందుఘట్ మలుపు రహదారి పక్కన నిలిపివేశారు. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వైపు వెళుతున్న మరో ప్రైవేటు బస్సు ఈ బస్సును ఢీకొట్టింది. రెండు బస్సుల్లో ఉన్న 90 మందికిపైగా ప్రయాణిస్తుండగా వారిలో నలుగురికి తీవ్రంగా, 14 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుల్ని స్థానిక మోహన ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. తీవ్ర గాయాలైన వారిని బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తుపానుపై సీఎం మోహన్ సమీక్ష

- సీఎస్‌తో మాట్లాడిన కేబినెట్ కార్యదర్శి



ముఖ్యమంత్రి మోహన్ సమీక్షా సమావేశంలో మంత్రి సురేష్, అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి సోమవారం సాయంత్రం భువనేశ్వర్ లోక్‌సేవాభవన్‌లో తుపానుపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహూజా, ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) దేవ్‌రంజన్‌కుమార్‌సింగ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుపాను నేపథ్యంలో ప్రాణనష్టం ఉండరాదని, సహాయక కార్యక్రమాల్లో లోపాలుండరాదని ఆదేశించారు. రాష్ట్రంలో 19,362 మరపడవలున్నాయని, మధ్యాహ్నానికి 19,351 పడవలు ఒడ్డుకు చేరుకున్నాయి. జగత్సింగ్‌పూర్‌లో 9, పూరీలో 2 పడవలు ఇంకా చేరుకోవాల్సి ఉందని అధికారులు సీఎంకు చెప్పారు. ఇవి తీరానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పునరావాస కేంద్రాలకు ముందుగా తీర ప్రాంతాల ప్రజల్ని తరలించాలని మోహన్ ఆదేశించారు.

కేంద్రం ఆరా..

కేంద్ర కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్ సోమవారం సాయంత్రం సీఎస్ మనోజ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను నేపథ్యంలో తీసుకున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.

కలహండిలో 600 ఏళ్ల నాటి శిలాశాసనం లభ్యం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కలహండి జిల్లాలో 600 ఏళ్ల నాటి శిలా శాసనం లభ్యమైంది. దీనిపై ఒడియా భాషలో లిపి చెక్కి ఉంది. జిల్లాలోని జునాగడ్‌లో హీరాసాగర్ సమీపాన పాతిపెట్టి ఉన్న దీన్ని తవ్వకాల్లో గుర్తించారు. ఈ విషయమై ఖరియార్ అటానమస్ కళాశాలకు చెందిన చరిత్ర విభాగం అధ్యాపకులు రాజ్‌కుమార్‌రాటే మాట్లాడుతూ.. శిలాశాసనం ఎత్తు 5 అడుగులు, వెడల్పు 1.5 అడుగులు ఉందన్నారు. దీనిపై చెరిగిపోయిన స్థితిలో అక్షరాలు ఉండడంతో బిష్ణు మోహన్ అధికారి అనే ఎపీగ్రాఫిస్టును సంప్రదించినట్లు చెప్పారు. ఒడియా భాషకు ప్రాథమిక రూపంలో లిపి చెక్కబడి ఉందని బిష్ణుమోహన్ గుర్తించినట్లు రాజ్‌కుమార్ వెల్లడించారు. తిరుగుబాటులో అణిచివేతకు గురైన మదన్ అనే యువకుడికి చెందిన శిలాశాసనంగా పేర్కొన్నారు. గంగా రాజవంశం కాలం నాటి అక్షరమాలకు చెందినట్లు ఈ లిపి ఉందని స్పష్టమవుతోందన్నారు. శిలాశాసనంపై ఉన్న యువకుడి రేఖాచిత్రాల ఆధారంగా ఇది 12 నుంచి 14వ శతాబ్దం మధ్య కాలం నాటిదిగా తెలుస్తోందన్నారు. శాసనంపై ఉన్న యువకుని కుడి చేతిలో కత్తి, ఎడమ చేతిలో రక్షణ కోసం ఉపయోగించే డాలు ఉన్నాయని రాటే పేర్కొన్నారు. గతంలోనూ ఇక్కడ పలుచోట్ల ఆనవాళ్లు లభ్యమైన విషయాన్ని రాజ్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.




బయటపడ్డ శిలా శాసనం

సహీదులకు నివాళి



అమర వీరుల స్మారక స్థూపం వద్ద పుష్పాలు ఉంచుతున్న సార్థక్ షడంగి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం '65వ పోలీసు సహీద్ దివస్' నిర్వహించారు. బ్రహ్మపుర పోలీసు జిల్లా ఆధ్వర్యంలో ఉదయం అంబపువాలోని రిజర్వ్ పోలీసు మైదానంలో జరిగిన కార్యక్రమానికి దక్షిణ మండల డీఐజీ డాక్టర్ సార్థక్ షడంగి అతిథిగా పాల్గొని కవాతు పరిశీలించారు. అనంతరం ఆయన బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం.తో కలిసి అమర వీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. బ్రహ్మపుర పెద్దబజారు, బి.ఎన్.పూర్, నిమ్మఖండి ఠాణాల్లో అమరులకు నివాళులర్పించారు. బ్రహ్మపుర ఎస్పీ ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమరుల కుటుంబ సభ్యుల్ని సత్కరించారు. గంజాం పోలీసు జిల్లా ఆధ్వర్యంలో ఛత్రపురంలోని రిజర్వ్ మైదానంలో కార్యక్రమం జరిగింది. గంజాం ఎస్పీ శుభేందు కుమార్ పాత్ర్ పాల్గొన్నారు. నువాపడ జిల్లా రిజర్వ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నువాపడ ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల పాల్గొని జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్మారక స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న రెడ్డి రాఘవేంద్ర గుండాల

భువనేశ్వర్‌లో ఆయుర్వేద చికిత్స కేంద్రం

● 29న ప్రారంభించనున్న ప్రధాని


కేంద్రమంత్రి ప్రతాప్‌తో ఎంపీ అపరాజిత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో యోగా, ప్రకృతి, ఆయుర్వేద చికిత్స కేంద్రం ప్రారంభం కానుంది. ఈ నెల 29న ప్రధాని నరేంద్రమోదీ దూరదృశ్య విధానంలో దీనికి ప్రారంభిస్తారు. కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు యాదవ్‌తో భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి సోమవారం దిల్లీలో సమావేశమయ్యారు. ఆసుపత్రికి సంబంధించి కూలంకషంగా చర్చించారు.

'స్పందన'కు 195 వినతులు


దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్‌ను అందజేసిన జిల్లా పాలనాధికారి పరిడా, ఎస్పీ పాత్ర్

బ్రహ్మపుర నగరం, గుణుపురం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్ సబ్‌కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యమానికి మంచి స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఏర్పాటైన ఇందులో 195 వినతులు అందాయి. వీటిలో 179 వ్యక్తిగతమైనవి, 16 గ్రామ సమస్యలకు సంబంధించినవి. గంజాం జిల్లా పాలనాధికారి దివ్యజ్యోతి పరిడా పాల్గొని అక్కడికక్కడ ఎనిమిది సమస్యలు పరిష్కరించారు. మిగిలిన వినతులు త్వరగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారుల్ని ఆయన ఆదేశించారు. రెడ్‌క్రాస్ నిధి ఒకరికి రూ.10 వేలు, మరొకరికి రూ.5 వేల ఆర్థిక సాయం, దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల తదితరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంజాం ఎస్పీ శుభేందు కుమార్ పాత్ర్, భంజనగర్ సబ్‌కలెక్టరు అనిల్‌కుమార్ సెఠి తదితరులు పాల్గొన్నారు. ● రాయగడజిల్లా రామన్నగుడ సమితి కేంద్రంలో జిల్లా కలెక్టరు పరూల్ పట్వారీ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రాయగడ ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, సబ్‌కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోతా, జిల్లా పరిషత్తు కార్యనిర్వాహక అధికారి నిహార్ రంజన్ కొంహార్, రామన్నగుడ సమితి అధ్యక్షుడు రవి శంకర గమాంగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టరు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 44 వినతులు స్వీకరించి వీటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వైద్యం కోసం ఒకరికి రూ.5 వేలు, మరో ఇద్దరికి రూ.2 వేలు చొప్పున చెక్కులు ఇచ్చారు. ముఖ్యమంత్రి కల్యాణ యోజనా ప్రజాశిబిరం ద్వారా ఉన్నత చదువులకు చేతన్ గమాంగ్‌కు రూ.20 వేల చెక్కును అందజేశారు.

ఉపాధ్యాయుల నియామకాలపై ఆందోళన

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఉపాధ్యాయుల నియామకాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా సోమవారం బొయిపరిగుడ సమితికి చెందిన బాలుగుడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గ్రామానికి చెందిన పిల్లలు పాఠశాలకు రారంటూ యువత ఆందోళనకు దిగారు. స్థానిక యువతకు జిల్లాలోనే ఉపాధి కల్పించాలంటూ నిరసన ప్రదర్శన చేశారు. బయట నుంచి వచ్చిన ఉపాధ్యాయులను వెంటనే వెనక్కు పంపి స్థానిక యువతను ప్రోత్సహించాలని, అప్పటివరకు గ్రామ విద్యార్థులు బడులకు వెళ్లరని పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు దుష్యంత్ తెలిపారు.

రాష్ట్ర తైక్వాండోలో 'టాబ్' బాలలకు పతకాలు



బ్రహ్మపుర క్రీడలు, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పూరీలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల తైక్వాండో పోటీల్లో బ్రహ్మపుర బాలలు పతకాలు దక్కించుకున్నారు. ఇందులో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ బ్రహ్మపుర (టాబ్)కు చెందిన నలుగురు క్రీడాకారులు రెండు పసిడి, ఒక రజత, ఒక కాంస్య పతకం గెలుచుకున్నట్లు కోచ్ సత్యనారాయణ త్రిపాఠి సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పోటీల్లో అద్యాస కిరణ్, స్మృతిరాణి పాత్ర్ చెరో బంగారు పతకం సాధించారని, రుద్రనారాయణ సాహు రజత పతకం, ఇతిశ్రీదాస్ కాంస్యపతకం కైవసం చేసుకున్నట్లు త్రిపాఠి పేర్కొన్నారు. సాయంత్రం స్థానిక చిన్నబజారులోని టాబ్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పతకాల విజేతలకు పుష్పగుచ్ఛాలందజేసి అభినందించారు.

● పూరీలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల తైక్వాండో పోటీల్లో గజపతి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-17 విభాగంలో సాయి స్వరూప్ పాణిగ్రహి కాంస్య, కె.స్మరణ తేజ్ రజత పతకాలు గెలుచుకున్నట్లు వివరించారు. పతకాలతో సోమవారం పర్లాఖెముండి పట్టణానికి చేరుకున్న వారికి అకాడమీ సభ్యులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.


విద్యార్థులతో గజపతి తైక్వాండో అకాడమీ కార్యదర్శి కార్తీక్‌చంద్ర మహాపాత్ర్

ఉద్యోగుల డీఏ పెంపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది 2024 జులై 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు సోమవారం రాత్రి భువనేశ్వర్‌లో సాధారణ పాలనా విభాగం అధికారవర్గాలు తెలిపాయి. దీంతో డీఏ 53 శాతానికి పెరిగింది. ఏడున్నర లక్షల మంది ఉద్యోగులు, విశ్రాంత సిబ్బందికి ప్రయోజనం కలుగుతుంది.

విజిలెన్స్ వలలో ఎస్సై

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ జిల్లా అఠాగఢ్ ఠాణా ఎస్.ఐ. షేక్ రెహమాన్ సోమవారం విజిలెన్స్ అధికారుల వలకు చిక్కారు. ఒక సారా వ్యాపారి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుబడ్డారు. ఇదివరకు రెహమాన్ సారా విక్రయిస్తున్న వ్యాపారుల నుంచి అడ్డగోలుగా సొమ్ము వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.

సీపీఐఎం రజతోత్సవ సమ్మేళనానికి ఏర్పాట్లు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా సీపీఐఎం రజతోత్సవ సమ్మేళన ఏర్పాట్లలో భాగంగా ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం పట్టణ వార్డు 18 ఆంధ్రాభవన్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ అగ్ర నాయకుడు సుజన్ చక్రవర్తి హాజరై జిల్లాలో పార్టీ ఆవిర్భావం నుంచి చేస్తున్న పోరాటాలు, పార్టీ పటిష్ఠతకు తీసుకోవల్సిన చర్యలు, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై ప్రత్యేక ప్రసంగించారు. వచ్చే జనవరి 12, 13 తేదీల్లో ఆంధ్రాభవన్‌లో రజతోత్సవ సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించారు.

సునాబెడ పురపాలక ఉపాధ్యక్షురాలిపై అవిశ్వాసం


సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ ఉపాధ్యక్షురాలు రీతుకంటపై అవిశ్వాస తీర్మానం కోసం రంగం సిద్ధమైంది. ఈమేరకు జిల్లా యంత్రాంగం వచ్చే నెల 8న తీర్మానించాలని ఖరారు చేసినట్లు ఉత్తర్వులను జారీ చేసింది. ఉపాధ్యక్షురాలు రీతు తీరు సక్రమంగా లేదని, తమతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఇతర కౌన్సిలర్లు జులైలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. జిల్లా యంత్రాంగం మౌనంగా ఉండటంతో మరో రెండుసార్లు ఉపాధ్యక్షురాలిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. దీంతో జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్ అవిశ్వాస తీర్మానానికి ఆదేశించారు. అదనపు కలెక్టర్ లగ్నజిత్‌రౌత్ సమక్షంలో ఆరోజు ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్ తెలిపారు.

మహాక్‌లో మెరిసిన చిన్నారులు

కొరాపుట్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మహాక్ టాలెంట్ టెస్ట్‌లో స్థానిక ఆస్థ అనాధ శరణాలయ విద్యార్థులు మెరిశారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో విద్యార్థులు పలు అంశాల్లో ప్రతిభ కనబర్చి ఆకట్టుకున్నారు. వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాల వంటి అంశాల్లో పరీక్ష జరిగింది. ఇందులో గెలుపొందినవారికి కొరాపుట్ ఉప జిల్లా పాలనాధికారి వేణుధర్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, కొరాపుట్



వ్యర్థాలతో డైనోసర్ ఆకృతి



వ్యర్థాలతో పలు కళాకృతులు రూపొందించి, స్టేషన్ పరిసరాల సుందరీకరణపై తూర్పుకోస్తా రైల్వే దృష్టిసారిస్తోంది. స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛత పక్వాడా వంటి కార్యక్రమాలతో వ్యర్థాల సద్వినియోగం వైపు అడుగులేస్తోంది. ఇందులో భాగంగా జోన్ పరిధిలో ఇప్పటికే పలు స్టేషన్లలో వీటిని అమలు చేశారు. ఇందుకోసం డీజిల్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, ట్రాక్షన్ సబ్‌స్టేషన్, డిస్ట్రిబ్యూట్ సెక్షన్ తదితర రైల్వేవిభాగాలు సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. పర్యావరణ పరిరక్షణ అంశంపై ఈ విభాగాలకు సంబంధించిన రైల్వే సిబ్బంది అవగాహన కల్పిస్తూ పలు ఆకృతులను రూపొందిస్తుండడం గమనార్హం. రైల్వే వ్యర్థాలు, తుక్కు సామగ్రితో మనదేశ త్రివర్ణ పతాకం, డైనోసర్లు, కుతుబ్ మీనార్ వంటి నమూనాలు, సంగీత వాయిద్యాలు, ఇతరత్రా కళాకృతులు రూపొందిస్తున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి.
– న్యూస్‌టుడే, రాయగడ పట్టణం

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

రాయగడ కేంద్రీయ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి కళా ఉత్సవ్ 2024-25 అబ్బురపర్చింది. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బృంద గానం, నృత్యం, ఆర్ట్ ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించారు. పనికిరాని చిత్తు కాగితాలతో అందంగా రూపొందించిన వీణ పలువురి ప్రశంసలు పొందింది. విద్యార్థులు చేసిన భిన్న సంస్కృతుల నృత్యాలు అలరించాయి. రాయగడ, గుణుపురం, గజపతి, సునాబెడ, కొరాపుట్, నవరంగపూర్, మల్కాన్‌గిరి కేంద్రీయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవ్‌కు హాజరయ్యారు. ఒక్కో విభాగంలో విజేతలకు ప్రథమ రూ.25 వేలు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ రూ.15 వేలు చొప్పున వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రధానాచార్యుడు ఆచార్య రాజారామ్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ చిన్మయి మహానంద ముఖ్యఅతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు.
– న్యూస్‌టుడే, రాయగడ



అమర జవానుల సేవలు చిరస్మరణీయం


స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ జతేంద్రకుమార్ పండా తదితరులు

పర్లాఖెముండి, రాయగడ, గుణుపురం, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణం బత్తగూడ రిజర్వ్ పోలీసు మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ జతేంద్రకుమార్ పండా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలు త్యాగం చేసిన అమరజవాన్ల సేవలు ప్రశంసనీయమని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబ సభ్యులకు సత్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అదనపు ఎస్పీ సునీల్ మహంతి తదితరులు పాల్గొన్నారు. ● మల్కాన్‌గిరి పోలీసు మైదానంలో జరిగిన 65వ అమర జవానుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ స్వాతి పాల్గొన్నారు. ● రాయగడ జిల్లా రామన్నగుడ సమితి భామిని ఐఆర్‌బీఎన్ బెటాలియన్ క్యాంప్‌లో సహీద్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్, గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, జీఐఈటీ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు చంద్ర ధ్వజ పండా, గుణుపురం నవనిర్మాణ సమితి అధ్యక్షుడు అక్షయదాస్ పాల్గొన్నారు.


జవాన్ కుటుంబ సభ్యురాలిని సత్కరిస్తున్న ఎస్పీ స్వాతి


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్

దంత వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి



భువనేశ్వర్‌లో ముఖ్యమంత్రి స్పందన కార్యక్రమం బయట వినతిపత్రంతో బినోద్ సాబత్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని ఎమ్మెకేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో దంత వైద్యంలో ఆధునిక చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు వైద్య కళాశాలను ప్రారంభించాలని గుసాని నువాగాం ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త బినోద్ కుమార్ సాబత్ కోరారు. సోమవారం భువనేశ్వర్‌లో జరిగిన ముఖ్యమంత్రి స్పందన (వినతుల స్వీకరణ) కార్యక్రమంలో సాబత్ ముఖ్యమంత్రి పేరిట ఓ వినతిపత్రాన్ని అందజేశారు.

సైకత యానిమేషన్‌తో రతన్ టాటాకు నివాళి

బ్రహ్మపురకు చెందిన కళాకారుడు సత్యనారాయణ మహారణా సోమవారం సైకత యానిమేషన్‌ను తీర్చిదిద్ది వ్యాపార దిగ్గజ దివంగత రతన్ టాటాకు నివాళులర్పించాడు.
– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం




బాలలతో దంపతులు పక్కన పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్

కెనడా దంపతులకు బాలల దత్తత..

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా శిశుసంరక్షణ పర్యవేక్షణలో ఉన్న 8, 6 ఏళ్ల బాలలను కెనడా దేశ దంపతులకు పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్ సోమవారం సాయంత్రం దత్తత ఇచ్చారు. అంతర్జాలం ద్వారా శిశు విభాగం గురించి తెలుసుకున్న వీరు నాలుగేళ్ల కిందట దరఖాస్తు చేసుకోగా, వివరాలను పరిశీలించిన అధికారులు వారికి దత్తత ఇచ్చేందుకు అంగీకరించారు. ఇప్పటివరకు 58 మంది శిశువులను దత్తత ఇచ్చినట్లు జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపారు.

ముఖ్యమంత్రి దృష్టికి జయపురం సమస్యలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో వివిధ సమస్యలు పరిష్కారం కోసం వచ్చేనెలలో భువనేశ్వర్‌కి వెళ్లి ముఖ్యమంత్రితో పాటు వివిధ శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని వికాస్ మోర్చా సభ్యులు అన్నారు. స్థానిక బ్రాహ్మణ సమాజ్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఎడిటర్ నబకృష్ణరథ్ మాట్లాడారు. న్యాయవాది ప్రఫుల్లకుమార్‌దాస్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో తన్వి సత్తా



బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నై (తమిళనాడు)లో ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీలో కొనసాగుతున్న 35వ సబ్‌జూనియర్ (అండర్-15, 17) జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి తన్విపత్రి విజేతగా నిలిచింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర క్రీడాశాఖ ఆ వివరాలను తన వెబ్‌సైట్లో వెల్లడించింది. ఆదివారం నిర్వహించిన అండర్-15 విభాగంలో సింగిల్స్ తుదిపోరులో తన్వి 21-13, 21-17 సెట్లతో దేవాంషి దలై (హరియానా)పై గెలుపొందినట్లు అందులో పేర్కొంది.



గెలుపొందిన వివిధ పాఠశాలల విజేతలు: చిత్రంలో క్లబ్ ప్రతినిధులు

చదరంగం విజేతలు వీరే

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రోటరీ సామాజిక భవనంలో జరిగిన అంతర్ పాఠశాలల చదరంగం పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో తుదిరౌండ్‌లో జూనియర్ విభాగంలో ప్రతీక్‌కుమార్ బెహరా (డీపాల్ స్కూల్), అరబ్‌కుమార్ పాత్ర్ (న్యూడీపాల్ స్కూల్), అభయదాస్ (ఢిల్లీపబ్లిక్ స్కూల్)లు వరుస మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్ విభాగంలో జయేష్ పాత్ర్, వారణాసి శ్రియాంష్ (సెయింట్ విన్సెంట్ కాన్వెంట్ స్కూల్), బిషాల్‌జ్యోతి పండా (ఒడిశా ఆదర్శ విద్యాలయ)లు మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. విజేతలకు వచ్చే నవంబరు 14న బహుమతులందజేయనున్నారు.

ఆశ్రమ ఉన్నత విద్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సమితి పొగడవిల్లి ఆశ్రమ ఉన్నత విద్యాలయ వసతి గృహంలో విద్యార్థులు తమకు సరైన మౌలిక వసతులు కల్పించడం లేదని ఇటీవల విద్యాలయం ముందు నిరసన తెలిపిన సంగతి విదితమే. ఈ మేరకు ఆదివారం సాయంత్రం గుణుపురం సబ్‌డివిజనల్ సంక్షేమ అధికారి సురజ్ నాయక్, అధికారులు పొగడవిల్లి బాలికోన్నత విద్యాలయానికి వెళ్లి అక్కడి విద్యార్థినులు, విద్యాలయం కమిటీ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై పూర్తి వివరాలను జిల్లా కలెక్టరు, జిల్లా సంక్షేమ అధికారి దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందని నాయక్ పేర్కొన్నారు.


రాయగడలో శివలింగానికి పూజలు


బ్రహ్మపురలోని నీలకంఠేశ్వరుని అలంకరణ

హరహర మహాదేవ

ఒడియా ప్రజల తొలి కార్తిక సోమవారం సందర్భంగా బ్రహ్మపుర, రాయగడలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బ్రహ్మపుర నగరంలోని నీలకంఠేశ్వరస్వామి దర్శనానికి వేకువజాము నుంచి భక్తులు నిరీక్షించారు. శివయ్యకు రుద్రాభిషేకం, 108 ఒత్తులతో దివ్య హారతి అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. – న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం, రాయగడ

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమితి కుడి గ్రామ పంచాయతీ మాలిమర్ల గ్రామానికి చెందిన చక్రధర్ గుంట కుమారుడు ప్రపుల ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా మంచానికే పరిమితయ్యాడు. ఊపిరితిత్తుల మార్పిడి చికిత్స కోసం రూ.30 నుంచి 40 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రకధమ్ ఆదివారం రాత్రి మాలిమర్ల గ్రామానికి వెళ్లి ప్రపులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కధమ్ ప్రపులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


ప్రపులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రకధమ్

పూరీలో గజలక్ష్మీ పూజలు

గోపాలపూర్, గుణుపురం, న్యూస్‌టుడే: పవిత్ర పూరీ ధామంలో కార్తికమాసం పురస్కరించుకుని శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో ప్రత్యేక సేవలు నిర్వహిస్తున్నారు. స్వామి రాధా దామోదర అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. హబిషార్థులు ప్రతాలు చేస్తున్నారు. మరోవైపు కుమార పౌర్ణమి నుంచి గజలక్ష్మీ పూజా వేడుకలు జరుగుతున్నాయి. అంతకంతకు యాత్రికుల సంఖ్య పెరుగుతోంది. ● రాయగడ జిల్లా గుణుపురం పట్టణంలో జరుగుతున్న గజలక్ష్మీ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గుణుపురం పట్టణం సమితి కార్యాలయం ఎదురుగా జరుగుతున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, పురసంస్థ ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడా ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు నృత్య, పాటల సంగీత కార్యక్రమంలో పాల్గొన్నారు. పద్మపురంలో గజలక్ష్మీ విగ్రహం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.


పూరీ గ్రాండ్ రోడ్డులో గజలక్ష్మీ తల్లి


గుణుపురం గజలక్ష్మీ ఉత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, తదితరులు



పిడుగు పాటుకు ఒకరి దుర్మరణం

● మరో చోట నాలుగు పశువుల మృత్యువాత

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితిలో సోమవారం మధ్యాహ్నం రెండుచోట్ల పిడుగుపడిన ఘటనల్లో ఓ వ్యక్తి, నాలుగు పశువులు మృతిచెందాయి. నందపూర్ తహసీల్దార్ అనాది చరణ్‌సాహు తెలిపిన వివరాల మేరకు.. బడేల్ పంచాయతీ మజ్జిపుట్‌కు చెందిన షేక్ అబ్దుల్(48) సోమవారం ఉదయం జయపురం వెళ్లి మధ్యాహ్నం స్వగ్రామానికి బస్సులో వచ్చి దతునిపుట్ కూడలి వద్ద దిగి గ్రామానికి నడిచి వెళ్తుండగా భారీ వర్షం కురుస్తుండటంతో ఓ మామిడిచెట్టు కింద నిలబడ్డాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సర్పంచి తులహింసా ఈ ఘటనపై నందపూర్ పోలీసుస్టేషన్‌కు సమాచారాన్ని ఇచ్చారు. మరో ప్రాంతం మాలిబెల్‌గాం పంచాయతీ పరిధిలో బోడో తంకువ గ్రామం సమీపంలో పిడుగు పాటుకు నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయి. ఆ గ్రామానికి చెందిన దనేశ్‌బోడి నాయక్, రాధ బోడో నాయక్, మధులకు సంబంధించిన పశువులుగా తెలిసింది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. బాధిత కుటుంబానికి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సహాయం అందేలా చూస్తానని తహసీల్దార్ అనాది చరణ్ హామీ ఇచ్చారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో ఆమె గొంతు నులిమి హత్య చేసి, మృతదేహాన్ని చెరువులో పడేసిన కేసులో నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ పోలీసులు సోమవారం భర్తను అరెస్టు చేశారు. ఐఐసీ ప్రశాంత్‌సెఠి తెలిపిన వివరాల ప్రకారం.. కుందేయి ఠాణా పరిధిలో ఖిలాలి గ్రామానికి చెందిన మహంగ గండ్, ఆయన భార్య రజన బాయి మధ్య గొడవ జరిగి ఆమె పుట్టింటికి వెళ్తానని పట్టుపట్టింది. ఈ నెల 13న ఆమెను తీసుకువెళ్తానని నచ్చజెప్పిన భర్త ఖిలాలి-సిమరడిహి గ్రామాల మధ్య ఉన్న అడవిలో ఆమెను హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేసి వెళ్లిపోయాడు. 17వ తేదీన గ్రామంలో ప్రజలు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

75 కిలోల గంజాయి స్వాధీనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి సమితి తండాపల్లి గ్రామం దగ్గర అడవిలో గంజాయి దొంగ రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 75 కిలోల గంజాయి స్వాధీనం చేయడంతో పాటు ఒకరిని అరెస్టు చేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకున్న మిగతా ఏడుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు మురియాపల్లి గ్రామానికి చెందిన కృష్ణ మద్కామిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశీయ తయారీ పిస్తోలు స్వాధీనం: ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బెల్లుగుంఠకు చెందిన శిలు అలియాస్ శిబరామ్ పండా అనే యువకుడ్ని బెల్లుగుంఠ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నుంచి ఓ దేశీయ తయారీ పిస్తోలు స్వాధీనం చేసుకున్నట్లు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

చోరీ కేసులను ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జతేంద్రకుమార్‌పండా


పర్లాఖెముండి, న్యూస్‌టుడే: కాశీనగర్, గురండి ఠాణా పరిధిలోని పలు చోట్ల గత కొన్ని రోజుల కిందట చోరీ కేసులు నమోదయ్యాయి. గురండి ఠాణా పరిధిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీని ఆధారంగా రాసూరు గ్రామ ప్రాంతంలో జరిగిన చోరీ, కాశీనగర్ పట్టణంలోని ఓ హోటల్ యజమాని ఇంట్లో జరిగిన చోరీలకు వీరి ప్రమేయం ఉందని భావించి దర్యాప్తు ముమ్మరం చేపట్టారు. పోలీసుల అదుపులో ఉన్న మహిళలు ఇచ్చిన సమాచారం ప్రకారం వీరికి మరో ఇద్దరు సహకరిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ విషయమై ఎస్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎస్పీ జతేంద్రకుమార్ పండా విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితులంతా నవరంగపూర్ జిల్లా పపడహండి ఠాణా పరిధిలోని బాబాజీ గుడ గ్రామానికి చెందిన ప్రతాప్‌జాని, అతని భార్య సరస్వతి జాని, దేవరాజ్‌మాఝి, గౌరీజానిలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.లక్ష 60 వేలు నగదు, 157.7 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 729 గ్రాముల వెండి సామగ్రి, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు మరో రెండు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

న్యాయం కోసం ఆరాటం


సమావేశంలో పాల్గొన్న కుటుంబీకులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ ఠాణా పరిధిలో కాలియాగూడ ప్రాంత సమీపంలో ఉన్న భారత్‌మాల ఓవర్ బ్రిడ్జి వద్ద గత నెల 13న జరిగిన బికాస్‌సింగ్‌లాల్ మృతిపై పోలీసులు కేసును పక్కదోవ పట్టిస్తున్నారని సోమవారం బాధిత కుటుంబీకులు నవరంగపూర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆరోపించారు. ఈ విషయంపై బొరిగుమ్మ ఠాణాధికారి జుగల్‌కిషోర్ సాహును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా బెదిరించి వాఙ్మూలం తీసుకోలేదని, హత్య లేక ప్రమాదమే అనేది పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



నవరంగపూర్, న్యూస్‌టుడే: అజాగ్రత్తగా వాహనం నడపటం వల్ల ఓ పెంకుటింట్లోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన నవరంగపూర్ జిల్లా చందహండి ఠాణా పరిధిలో దొలబెడ పంచాయతీలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇల్లు ధ్వంసం కాగా, అందులో నివసిస్తున్న వృద్ధ దంపతులు క్షేమంగా తప్పించుకున్నారు. ప్రమాదం తరువాత చోదకుడు నాయక్ మాఝి పరారయ్యాడు. గ్రామానికి చెందిన ఖగేశ్వర్‌మాఝి, ఆయన భార్య మైనమాఝి ఆ ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. నాయక్ సోమవారం మద్యం మత్తులో వాహనం నడపటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఈ వృద్ధ జంటను ఆదుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు విన్నారు... పరిష్కారం చూపారు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సోమవారం భువనేశ్వర్‌లోని సీఎం గ్రీవెన్స్ సెల్‌లో ప్రజా వినతులు విన్నారు. కార్యక్రమంలో మంత్రులు బిభూతి భూషణ్ జెనా (వాణిజ్య, రవాణా, ఉక్కుగనులు), నిత్యానంద గోండ్ (ప్రాథమిక విద్య), ముఖేష్ మహలింగ (ఆరోగ్యం), రబీనారాయణ నాయక్ (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వెయ్యిమంది తమ వివరాలు నమోదు చేసుకున్నారు. సీఎం, ఇతర మంత్రులు ప్రజల వినతులు విన్నారు. 600లకుపైగా సమస్యల పరిష్కారం జరగ్గా, మిగతా వాటిని ఆయా శాఖల ఉన్నతాధికారులకు అప్పగించారు. పక్షం రోజుల్లోగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉదయం 11 నుంచి ప్రారంభమైన సీఎం దర్బారు 4 గంటల వరకు కొనసాగింది.


అర్జీదారునితో మాట్లాడుతున్న సీఎం, పక్కన మంత్రులు

ప్రాణనష్టం లేకుండా చూడండి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: వాతావరణ అధ్యయన కేంద్రం ముందస్తు తుపాను హెచ్చరికల నేపథ్యంలో వైపరీత్యాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంగా పనిచేయాలని, ప్రాణనష్టం జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని గంజాం జిల్లా పాలనాధికారి దివ్యజ్యోతి పరిడా అన్నారు. సోమవారం మధ్యాహ్నం వర్చువల్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించి, పలు ఆదేశాలిచ్చారు. చేసిన సూచనలు, ఆదేశాలు ఇవీ...

★ 23, 24, 25వ తేదీల్లో అంతా అప్రమత్తంగా ఉండాలి. సమితి, తహసీల్‌లతోపాటు అన్ని శాఖల్లో 24 గంటలూ పనిచేసేలా నియంత్రణ గదులు ఏర్పాటు చేయాలి. ★ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దయ్యాయి. అంతా హెడ్‌క్వార్టర్‌లో ఉండాలి. ★ జిల్లాలోని బహుళ వినియోగ తుపాను రక్షిత కేంద్రాల్లో పరిస్థితిని సమీక్షించి, ఆయాచోట్ల తాగునీరు, జనరేటర్లు తదితరాలు సిద్ధం చేయాలి. ★ తుపాను, వరద ప్రభావిత ప్రాంతాల్లో కచ్చా, బలహీనంగా ఉన్న ఇళ్లల్లో ఉంటున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. అవసరమైతే పాఠశాలలు, కళాశాలల్ని పునరావాస కేంద్రాలుగా వినియోగించాలి. ★ సంచార (మొబైల్) టవర్లు నిరంతరం పనిచేసేలా జనరేటర్లు, చమురు సిద్ధంగా ఉంచుకోవాలని టవర్ సంస్థలకు ఆదేశం. ★ సహాయ కార్యక్రమాల కోసం మత్స్య శాఖ 1,528 పడవలు సిద్ధంగా ఉంచింది. అవసరమైతే ప్రైవేటు వ్యక్తుల పడవల్ని సేకరిస్తుంది. ★ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ పనుల కోసం విద్యుత్తు సరఫరా సంస్థ టీపీఎస్ఓడీఎల్ 2,500 మంది సిబ్బంది సిద్ధంగా ఉంచింది. ★ అటుకులు, బెల్లం, కిరోసిన్, ఔషధాల నిల్వలు అధికంగా ఉంచాలి. ★ బ్రహ్మపుర నగరంలో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, ఆయాచోట్ల నీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకోవాలి. నీటిని తోడేందుకు మోటారు పంపులు సిద్ధంగా ఉంచాలి. ★ సమితి స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి తుపాను పరిస్థితిపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలని పాలనాధికారి పరిడా ఆయా శాఖల అధికారుల్ని ఆదేశించారు. ఈ సమావేశంలో బ్రహ్మపుర, గంజాం ఎస్పీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి ముఖ్య అభివృద్ధి అధికారిణి, బ్రహ్మపుర, భంజనగర్, ఛత్రపురం సబ్‌కలెక్టర్లు, జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి తదిరులు పాల్గొన్నారు.


వర్చువల్‌లో అధికారులకు సూచనలిస్తున్న గంజాం జిల్లా పాలనాధికారి దివ్య జ్యోతి పరిడా. చిత్రంలో గంజాం ఎస్పీ తదితరులు

పోషక బియ్యం మరో నాలుగేళ్లు..!

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా అందజేస్తున్న పోషక బియ్యం మరో నాలుగేళ్ల పాటు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకు ఒకసారి పథకాన్ని పొడిగిస్తోంది. గత డిసెంబరులో ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు మరో రెండు నెలల్లో ముగియనుంది. ఇటీవల కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరో నాలుగేళ్ల పాటు ఉచిత బియ్యం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో జిల్లాలో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలగనుంది.

- జిల్లాలో చౌక దుకాణాలు 1,625
- ఎండీయూ వాహనాలు 422
- రేషన్ కార్డులు 6,71,803
- లబ్ధిదారులు 19,77,698
- తెల్ల కార్డులు 6,35,471
- లబ్ధిదారులు 18,80,952
- అంత్యోదయ 36,332
- లబ్ధిదారులు 96,746
- ప్రతి నెల బియ్యం కేటాయింపు 9,737 టన్నులు

2028 వరకు ఉచితంగా పంపిణీ

పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డులకు కేంద్రం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. మిగిలిన కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. గతంలో లబ్ధిదారులకు సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తుండగా కేంద్రం ఆదేశాలతో గతేడాది సెప్టెంబరు నుంచి పోషక బియ్యం పంపిణీ ప్రారంభించారు. సార్టెక్స్ బియ్యంలో 15 శాతం, నాన్‌సార్టెక్స్‌లో 25 శాతం వరకు నూకలు ఉంటాయి. గతంలో వీటినే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారు. పోషక బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో 100 కిలోల సార్టెక్స్ బియ్యంలో యంత్రాలతో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యంలో విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఉంటాయి. ప్రతి లబ్ధిదారుకు నెలకు ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి..

జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని పీఎంజీకేఏవై కార్డుదారులకు 2028 వరకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తారు. లబ్ధిదారులందరికీ పోషక బియ్యం అందుతాయి. పోషక విలువలతో కూడిన బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

ఒడిశాలో ప్రవాసీ భారతీయ దివస్

జనవరిలో నిర్వహించేందుకు సీఎం ఆమోదం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి ముంబయి రాకను పురస్కరించుకుని ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమానికి ఒడిశా వేదిక కానుంది. వచ్చే ఏడాది జనవరి 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్‌కు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆమోదం తెలిపారు. దీన్ని ఒడిశా సర్కార్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్తంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించనున్న దీని కోసం వేదిక ఎంపిక, ఇతరత్రా పర్యవేక్షణ కోసం మంత్రిత్వశాఖకు చెందిన ఐదుగురు ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, సీఎం మోహన్ పాల్గొననున్నారు. రెండో రోజు కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రవాస భారతీయ తీర్థ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వివిధ దేశాలకు చెందిన 5 వేల మందికి పైగా సభ్యులు ఇందులో పాల్గొననున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

క్రియాశీలక మహిళా సభ్యులపై దృష్టి పెట్టండి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని భాజపా మహిళా మోర్చా సామాజిక మాధ్యమం సమన్వయకర్త, గంజాం, గజపతి జిల్లాల సభ్యత్వ అభియాన్ ప్రభారి సుజాతా సాబత్ పాఢి అన్నారు. బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్ అధ్యక్షతన సోమవారం భాజపా మహిళా మోర్చా క్రియాశీల సభ్యత్వ అభియాన్‌పై శిక్షణ శిబిరం జరిగింది. గాంధీనగర్‌లోని బ్రహ్మపుర ఎంపీ, శాసనసభ్యుడి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిబిరంలో బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్, బ్రహ్మపుర సభ్యత్వ అభియాన్ ప్రభారి బనమాలి సెఠి, వార్డు కార్పొరేటరు సబితా సాహు, మహిళా మోర్చా గంజాం జిల్లా కార్యదర్శి రత్నగర్భ సరస్వతీ దేవి తదితరులు పాల్గొని మాట్లాడారు.


మాట్లాడుతున్న సుజాతా సాబత్ పాఢి. చిత్రంలో బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్ ఇతరులు

రాష్ట్రపతి పర్యటన వాయిదా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీముర్ము రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. ఈమేరకు సోమవారం అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ నెల 23 నుంచి 25 వరకు రాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. తుపాను నేపథ్యంలో ద్రౌపదీ ముర్ము పర్యటన వాయిదా పడింది.

గంజాయితో చిక్కిన ఒడిశా యువకులు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఆంధ్ర ప్రాంతంలోని రాజమహేంద్రవరానికి గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను సోమవారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం రాయగడ ప్రాంతానికి చెందిన జోసెఫ్, జబాష్, బరేంద్ర అనే ముగ్గురు పర్లాఖెముండి నుంచి పాతపట్నం మీదుగా రాజమహేంద్రవరానికి ఆరు కిలోల గంజాయి తీసుకెళ్తున్నారు. పాతపట్నం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు. సరకు స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఏనుగులు తొక్కేశాయ్!

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదబొండపల్లి పంచాయతీ పరిధిలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం రాత్రి జి.సురేష్, ఆదినారాయణకు చెందిన పొలాల్లోకి వెళ్లి పంటలు తొక్కేశాయి. ఉదయం పొలానికి వెళ్లిన రైతులు పాడైన పంట చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏనుగులను దూరంగా తరలించాలని కోరుతున్నారు.

ఆశయం ఉన్నతం.. ఆచరణ శూన్యం

ప్రజాప్రతినిధులకు పట్టక పోవడం.. అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడం వెరసి కోట్ల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అయింది. వందల మంది విద్యార్థులకు వసతి కల్పించాల్సిన భవనం నిరుపయోగంగా మారింది. పట్టించుకునే నాథుడు లేక సామగ్రి అంతా చోరుల పాలైంది. గ్రామానికి శివారు ప్రాంతంలో ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇదీ పాతపట్నంలో ఉన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితి. గతంలో ఎంతో ఉన్నత ఆశయంతో రూ.3 కోట్లతో దీనిని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు దాటుతున్నా ప్రారంభించలేదు. దీంతో ఏడాది కాలం నుంచి భవనంలో ఉన్న ఫర్నిచర్, ఫ్యాన్‌లు, నీళ్ల ట్యాపులు, విద్యుత్తు పరికరాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తలుపులు పూర్తిగా పాడయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు.

– న్యూస్‌టుడే, పాతపట్నం



ప్రయాణించాలంటే ప్రయాసే

పాతపట్నం- మెళియాపుట్టి మండలాలను అనుసంధానం చేసే ఆల్ ఆంధ్ర రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. పాతపట్నం పంచాయతీ పరిధిలోని షిరిడిగిరి వద్ద మార్గం సగ భాగానికి పైగా కొట్టుకు పోయి రాళ్లు తేలడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ జేఈ గోపాలరావును వివరణ కోరగా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పాతపట్నం



సీసీ రహదారి నిర్మించరూ..



ఇచ్ఛాపురం పట్టణ పరిధి స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం సమీప వీధిలో మట్టిరోడ్లపై మురుగు నిలిచి ఇబ్బందులు తప్పడంలేదు. కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారితోపాటు ఇరువైపులా కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ నల్లి రమేష్‌కు వివరణ ఇస్తూ..ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇక్కడ స్తంభం ఉంది గుర్తించగలరా?

వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి విద్యుత్తు ఉపకేంద్రం నుంచి బాతుపురం మీదగా చినవంక వైపు 33/11 కేవీ విద్యుత్తు సరఫరా అవుతున్న స్తంభాన్ని ఒంటిమర్రి చెట్టు సమీప తోటలో మామిడి చెట్టు పూర్తిగా కప్పేసింది. విద్యుత్తు తీగలతో పాటు కొమ్మలు చుట్టేసి ఆ ప్రదేశం ప్రమాదకరంగా మారడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మామిడి కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి వెంటనే కొమ్మలు తొలగించే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏఈ వెంకటరమణ తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



పగలూ వెలుగులే..

కంచిలి మండలం ఎస్.ఆర్.సి.పురం పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు రాత్రి పగలూ తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో దీపాలు వెలగక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ విద్యుత్తును వృథా చేస్తున్నారు. ఈ పరిస్థితి ఎస్.ఆర్.సి.పురం ప్రధాన రహదారిలో నెలల తరబడి కొనసాగుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం వివరణ కోరగా ఆ శాఖ జేఎల్ఎంతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు.

– న్యూస్‌టుడే, కంచిలి



పిడుగు పాటుకి కుంగిన బావి

మందస మండలం మకరజోల పంచాయతీ అల్లిమెరక కాలనీలో తాగునీటి బావి రాతికట్ట కొంత భాగం ఒక్కసారిగా కుంగింది. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే మహిళలు నీరు తోడేందుకు వెళ్లగా బావి కుంగడం చూసి ఉలిక్కిపడ్డారు. శనివారం రాత్రి వర్షంతో పాటు ఆ ప్రాంతంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దాని ధాటికి బావి రాతికట్ట కుంగి ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. స్థానికులకు ఈ బావి నీరే ఆధారం. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్నకుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)



ఎప్పుడు ప్రారంభిస్తారు..?



మందస మండలం సిద్ధిగాం పంచాయతీ శ్రీరాంపురం వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన గిడ్డంగి ఇది. మందస పీఏసీఎస్ పరిధిలో రైతుల కోసం బహుళ ప్రయోజన సౌకర్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడం లక్ష్యంగా ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయి దాదాపు పది నెలలు కావొస్తున్న వినియోగంలోకి రావడం లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.సూర్యారావు తెలిపారు.

– న్యూస్‌టుడే, మందస

విద్యార్థులకు పోషకాహారం తప్పనిసరి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జె.సౌమ్య జోస్పిన్ ఆదేశించారు. సోమవారం కురుపాం, శివ్వన్నపేటలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, మహాత్మా జ్యోతీబా పులే గురుకుల పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉన్న సరకులు, వంట గదులు, భోజనాలు పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని సూచించారు.


వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి సౌమ్యజోస్పిన్

శిథిల భవనాల్లో సచివాలయాలు

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు


కాశీబుగ్గ మండల పరిషత్తు కార్యాలయ వీధిలో ప్రమాదకరంగా ఉన్న 10వ వార్డు సచివాలయం

ప్రజలకు పాలన దగ్గర చేయాలనే ఉద్దేశంతో వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఆదరాబాదరగా శిథిల, ఇరుకు భవనాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. కనీసం వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆ భవనాలు నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. అధ్వాన గదుల్లోనే సచివాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ సేవలు అందించాల్సి వస్తోంది.

న్యూస్‌టుడే, పలాస

పురపాలక సంఘంలో 16 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 5 వివిధ ప్రభుత్వ, సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన 11 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. పురపాలక సంఘం ద్వారా ప్రతి నెల వీటికి అద్దె చెల్లిస్తుండగా రెండు లేదా మూడేళ్లకోసారి మరమ్మతులు లేదా రంగులు వంటివి సంబంధిత యజమానులు వేసి అప్పగిస్తుండాలి. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో సచివాలయాలను అప్పగించిన రోజు నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేసే పరిస్థితి లేకపోవటంతో ఉన్నవాటితోనే సర్దుకుపోవల్సి వస్తోంది.

మరుగుదొడ్ల శుభ్రత లేదు

సచివాలయాల నిర్వహణలో ఒక్కో దగ్గర 5 నుంచి 8 మంది వరకు విధులు నిర్వహిస్తు వీరంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లోనే ఉంటారు. మరుగుదొడ్లు వినియోగిస్తున్నా వాటిని శుభ్రం చేసేందుకు సహాయకులు లేకపోవడంతో ఉద్యోగులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వ హయంలో ఇళ్లను సచివాలయాలుగా ఎంపిక చేయడంతో పలుచోట్ల ఇరుకు భవనాల్లోనే సేవలు అందించాల్సి వస్తోంది. ఒకే గదిలోనే ఇద్దరు లేదా ముగ్గురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.


పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీ

పరిశీలిస్తాం..

సచివాలయాలను సందర్శించి వసతులు పరిశీలిస్తాం. శిథిల భవనాలు ఉంటే వాటిని వేరే చోటుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

కత్తిమీద సాము.. సరిహద్దుల్లో ప్రయాణం..


↑ పెద్దదిమిలి సమీపంలో భారీ గుంత

ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లో ప్రయాణాలు కత్తిమీద సాములా తయారయ్యాయి. రహదారులు దారుణంగా మారడంతో లారీ చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భామిని మండలంలో 27 కిలోమీటర్ల పొడవున ఉన్న ఏబీ రహదారి ఎక్కడికక్కడ గుంతలు, గోతులతో దర్శనమిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచిపోతోంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బగ్గామర్రిపాడు కాజ్‌పై ఏర్పడిన గోతిలో భారీ ఇసుక లారీ కూరుకుపోయింది. దీంతో ఊక, గ్రానైట్, ఇసుక లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సోమవారం ఉదయం పొక్లెయిన్ సాయంతో లారీని బయటకు తీయడంతో ట్రాఫిక్ అంతరాయం తొలగింది. రోజూ ఇదే పరిస్థితి ఉంటుందని లారీ చోదకులు వాపోతున్నారు. దీనిపై ర.భ శాఖ ఏఈ జగన్మోహనరాజు వద్ద ప్రస్తావించగా.. త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, భామిని


నిలిచిపోయిన భారీ గ్రానైట్ లారీలు